క్లుప్తంగా

చిన్నారికి పొన్నం ఫౌండేషన్ చేయూత



రశీదులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన ఓడ్నాల రక్షితకు పొన్నం రామలింగం ఫౌండేషన్ చేయూతనందించింది. రక్షిత తండ్రి ప్రభుదాస్ మృతిచెందాడు. కాగా రక్షిత చదువుల నిమిత్తం ఉమ్మడి రామగుండం మండలం మాజీ జెడ్పీటీసీ పొన్నం రామలింగం పేరుమీద ఏర్పాటు చేసిన పొన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పొన్నం సంతోష్, సతీశ్ రెండేళ్ల కాలానికి ఫీజు చెల్లించారు. ఆదివారం పాఠశాల యాజమాన్యానికి సంబంధిత ఫీజు చెల్లించి రశీదులను ప్రభుదాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాస్, ముల్కల కొమురయ్య, ఓడ్నాల కిషన్, పయ్యావుల శ్రీనాథ్, సంకరి కుమార్, అవినాష్, పాఠశాల కరస్పాండెంట్ మహేశ్ ఉన్నారు.

గ్రామాల్లో కొరవడిన ప్రత్యేక పాలన

మంథని: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొరవడిందని, అధికారులు శ్రద్ధ వహించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతికుమార్ అన్నారు. గ్రామాల్లో ప్రజలు వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని, జిల్లాలో వైరల్ జ్వరాలు తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందని, ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, వైద్య సిబ్బందితో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్ల పోచమ్మతల్లికి బోనాలు



నల్లపోచమ్మ తల్లి

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని కొండపై ఉన్న శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ తల్లి సహిత శ్రీబంగారు పోచమ్మతల్లికి ప్రతీ ఏటా శ్రావణమాసంలో బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఆదివారం స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ నేతృత్వంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

నియామకం



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని విసంపేటకు చెందిన బోడకుంట సుభాష్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పెద్దపల్లిలో బీపీ మండల్ జయంతి



నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం బీసీల ఆరాధ్యుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) జయంతి బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి బీసీ సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శ్రీమన్నారాయణ, కోఆర్డినేటర్ వివేక్ పటేల్ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. పెద్దపల్లి ట్యాంకు బండ్‌పై బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు రాజేందర్, రాజమౌళి, కిషోర్, రాజు, మల్లయ్య, సదానందం, క్రాంతి, శంకర్, నర్సయ్య, చంద్రబాబు, చందర్, ఖాజా, మహేశ్వర్, అరుణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎన్సీపీలో చేరిన యువకులు

గోదావరిఖని: స్థానిక 46వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్నకుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, చెన్నూరి నాగరాజు, ముజాహిద్, అక్షయ్, ఒంటేరు మనోజ్, ఆరెపల్లి కౌశిక్, ఎండీ.యూసుఫ్, ఇసకపల్లి వస్తిత్, రమేశ్, సంజయ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా రామగిరి సేవాసమితి

- సేవాభావంతో కార్యక్రమాలు
- ఆపదలో ఉన్న వారికి ఆసరా



నిరుపేద యువతికి ఆర్థికసాయం అందజేస్తున్న రామగిరి సేవా సమితి సభ్యులు (ఫైల్)

రామగిరి: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలన్న ఉద్దేశం, స్వచ్ఛంద సేవా చేయాలన్న లక్ష్యంతో నెలనెలా తలా కొంత వేసుకుని దాతల సహకారం తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రశంసలు అందుకుంటోంది రామగిరి సేవాసమితి.

గ్రూపు ఏర్పాటు చేసుకుని..

పేద కుటుంబానికి చెందిన కొంత మంది యువకులు తమ స్నేహితులతో కలిసి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ సేవలను విస్తృతం చేయాలన్న లక్ష్యంతో 2023లో ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి సహాయ సహకారాలతో రామగిరి సేవాసమితి పేరిట సోషల్ మీడియా ద్వారా గ్రూపు ఏర్పాటు చేశారు. గ్రూపు ఏర్పాటు చేసుకొని సేవా సమితి సభ్యులు ప్రతీనెల రూ.100 చొప్పున జమ చేస్తారు. ఈ నగదును ఆపదలో ఉన్న వారికి సాయం చేయడానికి ఉపయోగిస్తారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించి పలువురి మన్ననలు పొందుతున్నారు. అవసరమైనవారికి వైద్య ఖర్చులకు, నిరుపేద యువతి వివాహాలకు ఆర్థిక సాయం, అభాగ్యులకు అండగా నిత్యావసర సరుకుల పంపిణీ లాంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామగిరి సేవాసమితి ఏర్పాటు చేసింది పేదవారికి సాయం మాత్రమే అనే క్యాప్షన్‌తో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని సేవాసమితి సభ్యులు పేర్కొంటున్నారు.

భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు



అభాగ్యులు, అన్నార్తులకు సాయం చేయడం చాలా సంతోషంగా ఉంది. నా భర్త మేకల మారుతి ద్వారా రామగిరి సేవా సమితిలో చేరి నావంతు పాత్ర పోషిస్తున్నాను. అందరూ ఐక్యంగా పనిచేస్తుండటంతో సేవా కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయి. దాతల సాయంతో భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటున్నాం. సేవాసమితిలో సభ్యురాలిగా ఉంటూ పేదవారికి సాయం చేయడం ఆనందంగా ఉంది.

– మేకల శరణ్య, ప్రకృతి వైద్యనిపుణురాలు, కల్వచర్ల

పథకాలు అందేలా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

గోదావరిఖని: ప్రభుత్వ పథకాలు ప్రతిపేదవారికి అందేలా చూడాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఆదివారం స్థానిక దుర్గానగర్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్ఎంపీలు

గోదావరిఖని/పాలకుర్తి: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఆర్ఎంపీలు ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే తమపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయని, క్రిమినల్ కేసులు పెడుతున్నారని ఆర్ఎంపీలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు విన్నవించారు. రాతపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వెంటనే డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యలపై చర్చించారు. తమ వద్దకు వచ్చే పేషెంట్లకు స్థాయికి మించి వైద్యం చేయకుండా ప్రథమ చికిత్స చేసి అవసరమున్న వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు వారు తెలిపారు. ఆర్ఎంపీలు శ్యాం, మనోజ్, కామెర రమేశ్, బాబునాథ్, కాల్వ మల్లేశ్, జగన్, జనగామ రాజు పాల్గొన్నారు.





శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఓ వైపు కృష్ణులు ఉట్టి కొడుతుంటే ఆట పట్టిస్తున్న గోపికలు నీళ్లు చల్లుతూ సందడి చేశారు. శ్రీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ట్రినిటి ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి వేడుకలు నిర్వహించారు. గోపికలు, కృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం



జూలపల్లి: పీఆర్‌టీయూ కార్యవర్గానికి సన్మానం

జూలపల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమే పీఆర్‌టీయూ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో పీఆర్‌టీయూ మండల సమావేశం పి.ముత్యంరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సురేశ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.ముత్యంరావు, ప్రధాన కార్యదర్శిగా బొల్లం ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా నర్సింహస్వామి, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీత, కార్యదర్శిగా కుమార స్వామిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. రాష్ట్ర బాధ్యులు అనంతరెడ్డి, కొత్త శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎలిగేడు: నూతన కార్యవర్గంతో నాయకులు

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ మండలశాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి అతిథిగా హాజరయ్యారు. పీఆర్టీయూ ఎలిగేడు మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల చంద్రమౌళి, సహాధ్యక్షుడిగా గుడికందుల ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బూర లావణ్య, కార్యదర్శిగా ఎం.దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మెరుగు తిరుపతి వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరికొండ రవీందర్‌రావు, పుల్లెల్ల శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బైక్ అదుపుతప్పి దంపతులకు గాయాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి భార్యాభర్తలు కిందపడి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని వైద్యులకు సూచించారు.

- **పూసల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్**

పెద్దపల్లిరూరల్: పూసల సంఘం పట్టణ అధ్యక్షుడిగా నగిశెట్టి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నికైన శ్రీనివాస్‌ను పలువురు నాయకులు అభినందించారు.

- **ఓదెల ఏవోగా భాస్కర్**

ఓదెల: మండల వ్యవసాయాధికారిగా భాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

- **అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా చందు**

సుల్తానాబాద్: ప్రెస్‌క్లబ్ సభ్యత నమోదు అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా పెగడ చందు, కో కన్వీనర్లుగా బోయిని వినోద్, మంద శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రకటించారు. మండల కేంద్రంలోని వైశ్య భవనంలో ఆదివారం ప్రెస్‌క్లబ్ సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ్యులు వ్యక్తిగతంగా సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోవాలని, 28 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న ప్రతీ సభ్యుడు దరఖాస్తులను అడ్‌హక్ కమిటీ కన్వీనర్లకు అందించాలని సూచించారు. అడ్డగుంట రాజేందర్, బైరగోని రవీందర్ గౌడ్, పెగడ మధు, మంద నాగార్జున, సుంక మహేశ్, బుర్ర ఓంకార్‌గౌడ్, దాసోహం గోపికృష్ణ, చొప్పరి సుమన్, బొల్లి సత్యనారాయణ, టి.సరళ-సంజయ్, బాలరాజ్ పాల్గొన్నారు.

- **పర్స్ అప్పగింత**

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జండా వద్ద తనకు దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు బీజేవైఎం నాయకుడు కిరణ్. కేశవపట్నం మండలం ఎరడపల్లి గ్రామానికి చెందిన రాజు తన పర్సును పెద్దపల్లిలోని జెండా ప్రాంతంలో ఆదివారం పోగొట్టుకున్నారు. కాగా తనకు దొరికిన పర్సును కిరణ్ పోలీసుల సమక్షంలో తిరిగి అప్పగించారు. పర్సులో రూ.2600 నగదు, పలు కార్డులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

- **హజ్ యాత్రికుడికి సన్మానం**

పాలకుర్తి: హజ్‌యాత్రకు కాలినడకన బయలుదేరిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన అబిద్‌ను ఆదివారం జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం సన్మానించారు.

బీసీలకు అండగా ఉంటా



స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్/ఎలిగేడు: బీసీలు సమస్యల సాధనకు ఉద్యమించాలని, అండగా ఉంటానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ ఎలిగేడు మండలం శివపల్లిలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, చీటి సతీశ్‌రావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఒర్రె అజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జ్యోతి

జ్యోతినగర్: పితృస్వామ్య ఆధిపత్యాన్ని దిక్కరిద్దామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్త్రీలపై వివక్ష, ఆర్థిక, భౌతిక, సామాజిక, దాడులహింస నిరవధికంగా కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేసే కార్మికులుగా లక్షలాది మంది మహిళలు పని చేస్తున్నా, వారికి గౌరవం లేకపోవడం, స్వచ్ఛంద కార్మికులు అని ముద్ర వేసి కనీస వేతనాలు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 31, సెప్టెంబర్ 1,2వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర 7వ, మహాసభలను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మహిళలు, మహిళా కూలీలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, సరోజన, కవిత, కనకలక్ష్మి, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

27న గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

ధర్మారం: మండలంలోని నందిమేడారం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో భర్తీ చేయడానికి ఈ నెల 27న స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీలో 5సీట్లు, ఎంపీసీలో 5 సీట్లు ఖాళీ ఉన్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్తదానం.. స్ఫూర్తిలో అన్నదానం



రక్తదానం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగులకు అన్నదానం చేయడంతో పాటు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రక్తదానం చేశారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని జెండాకూడలిలో అభిమానుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో 15మంది యువకులు రక్తదానం చేశారు. నాయకులు కొలిపాక రాము, నెత్తెట్ల వెంకటేశ్, సాగర్, రాజు, సది, సంతోష్, తిరుపతి, శంకర్, నక్కరమేశ్, కృష్ణ పాల్గొన్నారు.



కమాన్‌పూర్: మండలంలోని గుండారం హనుమాన్‌నగర్‌లో నివాస గృహాలపై చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం పడిన సమయంలో ఇంటిపైకి వెళ్లాలంటే భయపడుతున్నాం. విద్యుత్ వైర్లను సరి చేయాలని పలుమార్లు సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి. – గరిగంటి రాజేశ్, స్థానికుడు

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేంద్రకుమార్, ఏఈ, కమాన్‌పూర్, ఫోన్: 94408 11494

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94403 81258

సమాజహితమే వీహెచ్‌పీ ధ్యేయం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పెద్దపల్లిరూరల్: సమాజహితమే ధ్యేయంగా విశ్వహిందూ పరిషత్ పని చేస్తుందని వీహెచ్‌పీ ప్రాంత కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. వీహెచ్‌పీ ఆవిర్భవించి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సెప్టెంబర్ 1 వరకు షష్టిపూర్తి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని మండల, జిల్లా కేంద్రాల్లో ఆత్మీయసమ్మేళనాలు నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయాలకతీతంగా వీహెచ్‌పీ సమ్మేళనాల్లో పాలు పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగుల మల్యాల సత్యం, ప్రాంత సేవక్ కోమల్ల రాజేందర్‌రెడ్డి, కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ అయోధ్య రవి, నాయకులు బత్తుల విజయ్, అరిసె రమేశ్, బొమ్మకంటి రవి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి



సన్మానిస్తున్న సంతోష్‌కుమార్

సుల్తానాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ కోరారు. మండల కేంద్రానికి ఆదివారం మొదటిసారి వచ్చిన సందర్భంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. జిల్లావ్యాప్తంగా కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని, సెప్టెంబర్ మొదటి వారంలో ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 20శాతం నుంచి 42శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంతోష్‌కుమార్, ఓంకార్, ఎల్ల స్వామి పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి భారీగా విరాళాలు



విరాళాలు ఇచ్చిన దాతలతో గ్రామస్తులు

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లోని శ్రీకోదండ రామాలం నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు భారీగా వచ్చాయి. ఆలయ నిర్మాణం కోసం కల్లెం స్వామి, లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారులు మాధవి, శైలేందర్‌రెడ్డి, దేవేంద్ర రాజేశ్వర్‌రెడ్డి ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షలు, దారబోయిన లింగయ్య, శశికళ జ్ఞాపకార్థం వారి కుమారులు మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్, సుభాషిణి, మధుకర్, శిరీష గ్రానైట్ కోసం రూ.1.28లక్షలు, మారుపాక శ్రీలత, కుమార్ రూ.30వేలు, తీగుల్ల సంకీర్తన, అజయ్ రూ.50వేలు, పద్మ, నరేందర్ రూ.20వేలు, నేరేడుకొమ్మ హరి రూ.15వేలు, బట్టు నిర్మల, రాజయ్య రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గండు సంజీవ్, బంటు ఎల్లయ్య, కొమ్ము పోచాలు, బైరెడ్డి మధుకర్, మాజీ ఎంపీటీసీ కాసర్ల రాజు, బండి స్వామి ఉన్నారు.

భయం గుప్పిట్లో విద్యార్థులు



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రయాణిస్తున్న పాఠశాల టాటా ఏస్ ఆటోకి వెనకడోర్ ఓపెన్ చేసి ఉండడంతో విద్యార్థులు భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. పాఠశాలకు వెళ్లే క్రమంలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేస్తే విద్యార్థులు కింద పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



సుల్తానాబాద్: పట్టణానికి చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో బంగారు పథకాలు సాధించారని మాస్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం రెవెన్యూ గార్డెన్‌లో నేషనల్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో సుల్తానాబాద్ నుంచి హర్షవర్ధన్ అభినయ్, రిషి వర్ధన్ గోల్డ్ మెడల్స్ సాధించారని ఆయన తెలిపారు. మంకీ ఫిస్ట్ కుంగ్ ఫూ అకడమిక్ డైరెక్టర్ జి.సతీశ్ ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు శ్రీనివాస్ బహుమతి ప్రదానం చేశారు.